క్లుప్తంగా

కొనసాగుతున్న జ్ఞానయజ్ఞ పూజలు



పూజలు చేస్తున్న పీఠాధిపతి రంగనాథ అయ్యవార్లంగార్

సీతానగరం: మండల కేంద్రంలో గల లక్ష్మీనృసింహ స్వామి, వేణుగోపాలస్వామి ఆలయం ప్రాగంణంలో 5వ రోజు శనివారం జ్ఞానయజ్ఞ పూజలు ఘనంగా జరిగినట్లు అర్చకుడు శ్రీనివాసరావు తెలిపారు. లక్ష్మీనృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వశాంతి శ్రీమహద్ భాగవత సప్తాహజ్ఞాన యజ్ఞ పూజలను పనసలవలస వైష్ణవాచార్యపీఠం పరంపరాగత పీఠాధిపతి రుమల రంగనాథ అయ్యవార్లంగార్ ప్రత్యక్ష పర్య వేక్షణలో పీసపాటి రామానుజాచార్యులు 20 మంది రుత్విక్కులతో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవం సందర్భంగా పూజలు జ్ఞాన, యజ్ఞయాగాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు వేద పండింతులు, పీఠాధిపతులతో పూజా కార్యక్రమాలు జరగనున్నట్లు అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు.

ఐటీడీఏ ఈఈగా మణిరాజు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలను స్వీకరించిన ఈఈ మణిరాజు

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎ.మణిరాజు శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కేవీఎస్ఎన్ కుమార్‌కు ఎస్ఈగా పదోన్నతి రావడంతో ఇక్కడి నుంచి ఆయన బదిలీపై వెళ్లారు. ఈమేరకు సాలూరు సబ్‌డివిజన్‌లో డీఈఈగా పనిచేస్తున్న మణిరాజును పదోన్నతిపై పార్వతీపురం ఐటీడీఏకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు కృషిచేస్తానని నూతనంగా బాధ్యతలను స్వీకరించిన అనంతరం పేర్కొన్నారు.

ఆశ్రమ పాఠశాల అదనపు గదులు పనుల ప్రారంభం



అదనపు గదుల నిర్మాణానికి పునాదులు తవ్వుతున్న జేసీబీ

సాలూరు రూరల్: మండలంలోని కొత్తవలస బాలికల ఆశ్రమ పాఠశాల అదనపు వసతి గదుల నిర్మాణ పనులకు రూ.175 లక్షల అంచనా విలువతో ఈ ఏడాది మార్చిలో అప్పటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర శంకుస్థాపన చేశారు. అయితే వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై, ప్రభుత్వం మారడంతో పనుల ప్రారంభంలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఇంతవరకు కొత్తవలస బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న వసతి సమస్య త్వరలోనే తీరనుంది. ఈ విషయంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచండి



సూచనలిస్తున్న ఎంఈవో గౌరునాయుడు

జియ్యమ్మవలస: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని, ఆ దిశగా ప్రధానోపాధ్యాయులంతా కృషి చేయాలని ఎంఈవో-1 గౌరునాయు డు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివా రం సమావేశమైన ఆయన.. సిబ్బంది సమయపాల న పాటించి, విద్యార్థులకు చక్కగా చదువు చెప్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు తప్పనిసరిగా చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా చూడాలని, విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్యాలు పెంచేలా విద్యాబోధన చేయాలన్నారు. అలాగే నాణ్యమైన భోజనం వారికి అందించాలని తెలిపారు. బడితోట పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. లెస్సన్ ప్లాన్ ఆధారంగా పాఠ్యాంశాల బోధన జరగాలని, టీచర్ డైరీని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఎంఈవో-2 శ్రీని వాసరావు మాట్లాడుతూ ప్రతి నెలా సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని, ఉపాధ్యాయుల హాజరును సమయానికి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

ఉపాధి పనులు చట్టబద్ధంగా అమలు జరగాలి

- ఎంపీపీ మజ్జి శోభారాణి

పార్వతీపురంటౌన్:

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చట్టబద్ధంగా అమలు జరగాలని ఎంపీపీ మజ్జి శోభారాణి అన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులతో శనివారం ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రకాల ఉపాధి హామీ పనులు కూడా 2005 ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టం ప్రకారం గ్రామపంచాయతీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరగాలని అన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం దానికి విరుద్ధంగా వెండర్ల విధానం ద్వారా పనులు చేపట్టి దోపిడీకి తెరలేపిందని ఆరోపించారు. ఉపాధి హామీ పనులు చేపట్టిన వెండర్ (కాంట్రాక్టర్) ఎటువంటి లాభాపేక్ష లేకుండా పనులు చేస్తారా? అని ప్రశ్నించారు. కూటమి నాయకులే ఇక్కడ వెండర్ల అవతారం ఎత్తి దోచుకోవడానికి తెరలేపారన్న అనుమానం ప్రజలకు కలుగుతోందని మండిపడ్డారు. ఆగస్టు 14న రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించామని, గొప్పలు చెప్పుకున్న ఉపముఖ్యమంత్రి అదే ఉపాధి హామీ పనులలో సర్పంచుల హక్కులను కాలరాస్తూ వారిని నిర్వీర్యం చేయడం ఎంతవరకు సమంజసమో ఆయనే చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల ద్వారా ఎన్నికైన సర్పంచుల ద్వారానే ఉపాధి హామీ పనులను చేపట్టి వారి ద్వారానే నగదు చెల్లింపులు కూడా జరిగేలా చూడాలని, అన్ని గ్రామాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, కావున ప్రజల అదృష్టం మేరకే ప్రభుత్వం నడుచుకోవాలని తామంతా కోరుతున్నామన్నారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లతో గ్రామసభలో తీర్మానించిన 2024-25ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులను పంచాయతీ ద్వారానే చేయించాలని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ విజయలక్ష్మికి శనివారం వారంతా వినతిపత్రం అందజేశారు. 2024-25ఆర్థిక సంవత్సరంలో ఇటీవల ఉపాధిహామీ పథకం ద్వారా సర్పంచ్‌ల ఆమోదంతో మంజూరైన పనులను వారితో చేయించి వాటి బిల్లులు, నగదు చెల్లింపులు పంచాయతీ ఉపాధిహామీ బ్యాంక్ అంకౌంట్ ద్వారా చెల్లించాలని కోరారు. 2006 ఉపాధిహామీ చట్టం ప్రకారం కాకుండా అధికార దాహంతో కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం సరైన పద్ధతి కాదని అసహనం వ్యక్తం చేశారు. వెండర్ పేరుతో బిల్లులు చెల్లించేటప్పుడు సదరు వ్యక్తి సంబంధిత మెటీరియల్ వ్యాపారంలో ఉన్నాడో లేడో పరిశీలించుకోవాల్సిన బాధ్యత మీదేనని స్పష్టం చేశారు. పంచాయతీ తీర్మానించిన వెండర్‌ను ఎంపిక చేయలేని ఎడల న్యాయపరమైన ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం చట్టం పరిధిలోనిది కనుక వాటి నిర్వహణ, బిల్లుల చెల్లింపులు పంచాయతీ ద్వారానే ఇప్పటివరకు జరిగాయని, అందువల్ల సర్పంచ్‌ల హక్కులను కాలరాయకుండా వారి హక్కులు వారికి ఉండేలా చూడాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.



పార్వతీపురం టౌన్: ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచులు



బలిజపేట:ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, సర్పంచ్‌లు ఎం.సుమలత, కె.మోహనరావు, ఆర్.శ్రీనివాసరావు, ఎ.సుందరరావులతో సహా 16పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న వివిధ రకాల ఉపాధి హామీ పనులు 2005 ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టం ప్రకారం గ్రామపంచాయతీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరగాలని, చట్టం చెబుతుండగా కూటమి ప్రభుత్వం మాత్రం దానికి విరుద్ధంగా వెండర్ల విధానం ద్వారా పనులు చేపట్టి దోపిడీకి తెరలేపడం మంచిది కాదని సీతానగరం మడల సర్పంచ్‌ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసర్పంచ్‌లు అత్యవసరరంగా సమావేశమయ్యారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ త్రివిక్రమరావుకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం ప్రతినిధులు వెంకటనాయుడు, తిరుపతిరావులతో పాటు 25 మంది సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సీతాపనగరం: ఎంపీడీఓ త్రివిక్రమరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న మండల సర్పంచ్‌లు

రుణాల మంజూరులో సాలూరుకు అవార్డు

సాలూరు: 2023-24 సంవత్సరానికి సంబంధించి పీఎం స్వనిధి రుణాల మంజూరులో సాలూరు మున్సిపాలిటీ రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు ఈ నెల 29న విజయవాడలోని తుమ్మలపల్లికళాక్షేత్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఈ అవార్డు తీసుకోనున్నారు.ఈ ఘనత సాధించడానికి కృషి చేసిన మెప్మా సీఎంఎం పుష్ప, సిబ్బందిని కమిషనర్ అభినందించారు. పీఎంస్వానిధి కింద స్వయం ఉపాధి కల్పన కోసం మున్సిపాలిటీలో పలువురు వీధి విక్రయదారులకు బ్యాంకుల ద్వారా మెప్మా సిబ్బంది రుణాలు మంజూరు చేయించారు.

ఈ నెల జీతం అందేటట్టు లేదు..

పాలకొండ : మండలంలోని సచివాలయ ఉద్యోగులకు ఈ నెల జీతాలు అందే పరిస్థితి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన బదిలీలు గందరగోళంగా మారడంతో సచివాలయ ఉద్యోగులకు జీతాల బిల్లులు పెట్టుకునే అవకాశం లేకండా పోయింది. ఉద్యోగులకు సాధారణంగా ప్రతి నెలా 25వ తేదీ లోపు జీతాల బిల్లులు పెట్టుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మండలంలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు ఈ నెల 3తో ముగిశాయి. రిలీవింగ్ ఆర్డర్లు మాత్రం ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. సచివాలయం పరిధిలో పంచాయతీ కార్యాదర్శులే డీడీఓలు కావడంతో ప్రస్తుతం బిల్లులు పెట్టే అవకాశం లేకుండా పోయింది. రిలీవింగ్ ఆర్డర్లు ఈ నెల 4వ తేదీతో ఇవ్వాల్సి ఉంది. అయితే ఇంతవరకు మండలంలోని సచివాలయ ఉద్యోగులను రిలీవ్ చేయలేదు. దీంతో ఇంతవరకు పనిచేసే చోట జీతాలు పెట్టుకునే అవకాశం లేదు. ప్రస్తుతం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసి స్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు బదిలీలు జరిగా యి. వెటర్నరీ, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు బదిలీలు జరగకపోయినా.. బదిలీ అయిన వారికి రిలీవింగ్ ఆర్డర్లు ఇవ్వకపోవడంతో వీరికి కూడా జీతాలు నిలిచిపోనున్నాయి.

సేంద్రీయ రైతుకు కలెక్టర్ సత్కారం

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన రైతు సువ్వాడ గణేష్‌ను కలెక్టర్ శ్యామ్‌పసాద్ శనివారం సత్కరించారు. గణేష్ తన పొలంలో సేంద్రీయ ఎరువులతో వివిధరకాల పంటలను పండించి అధికారుల దృష్టిని ఆకర్షించడంతోపాటు పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈ విషయంలో ఇటీవల వ్యవసాయ అధికారులు తన ఆయిల్ పామ్ తోటలో వేసిన కొబ్బరి,బంతి, టమాటో, బొప్పాయి పంటలను పరిశీలించి ఆయనను ప్రోత్సహించారు. ఈ విషయంపై రైతు గణేష్ తాను సాగుచేస్తున్న విధానాన్ని వివరిస్తూ సేంద్రియ విధానంలో సాగును ప్రోత్సహించాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశాడు. దీంతో ఆ రైతును మరింత ప్రోత్సహించాలని వ్యవసాయాధికారులకు కలెక్టర్ సూచించారు. అలాగే జ్ఞాపికను అందజేసి గణేష్‌ను సత్కరించారు.



రైతు గణేష్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

దళిత ఎమ్మెల్యేకు దళితులపైనే అక్కసు

- దళిత బహుజన సేవాసంఘం



కామేశ్వరరావు

బలిజిపేట: దళితుడైన పార్వతీపురం శాసనసభ్యుడు విజయచంద్ర దళితులపైనే అక్కసుతో ఉన్నారని దళిత బహుజన సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లబారిక కామేశ్వరరావు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ బలిజిపేట మండలంలోని నారన్నాయుడువలసలో కుష్టువ్యాధితో బాధపడుతున్న ఎస్సీ కుటుంబానికి చెందిన సీహెచ్ పోలమ్మ పింఛన్ నిలిపివేయించారని మండిపడ్డారు. గలావల్లి పీహెచ్‌సీ సిబ్బందిని బెదిరించడం వంటి కార్యకలాపాలకు ఎమ్మెల్యే విజయచంద్ర పాల్పడుతున్నారని ఆరోపించారు. టీడీపీ వర్గీయులకు మాత్రమే పనులు చేయాలని తహసీల్దార్‌కు చెప్పడం అన్యాయంగా ఉందని, ఇటువంటి తీరును ఎమ్మెల్యే మార్చుకోవాలని కోరారు. మండలస్థాయి అధికారులు పార్టీలకు అతీతంగా పనులు చేయాలి తప్ప పార్టీలకు కొమ్ము కాయవద్దని హితవు పలికారు. తీరుమార్చు కోకుండా శ్రుతిమించితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి న్యాయపోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

గరుగుబిల్లి: నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సూచించారు. మండలంలోని శివ్వాం గ్రామంలో సీసీ రోడ్లు, రక్షణ గోడ నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, జిల్లాలోని 15 మండలాల్లో అభివృద్ధి పనులకు అవసరమైన ప్రతిపాదనలు పంపించడం, నిధుల మంజూరు జరుగుతోందన్నారు. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కురుపాం నియోజకవర్గంలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో 16 పనులకు గాను రూ.18.17 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. శివ్వాం గ్రామ శివాలయానికి ఆనుకుని ఉన్న రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరైందన్నారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దని, సకాలంలో పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అధికారి గౌరీశంకరరావు, కార్యదర్శి బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



శివ్వాంలో కొత్తగా నిర్మించిన రక్షణ గోడను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

అప్పయ్యపేటలో 60 మందికి వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పావని

సీతానగరం: గ్రామాల్లో వివిధ రకాలవ్యాధులతో ఇబ్బందులు పడు తున్న రోగులకు 104 సంచార వాహనం ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పావని చెప్పారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని అప్పయ్యపేటలో 104 ద్వారా ఉచిత వైద్యశిబిరం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ అప్పయ్యపేటలో సుగర్, బీపీ, ఆస్తమా, కీళ్లనొప్పులు, జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న 60 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బురిడి కుసుమ,104 సిబ్బంది ప్రసాద్, ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బి సూర్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

జియ్యమ్మవలస: మండల పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 21వ తేదీన నమోదైన అట్రాసిటీ కేసుపై పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు శనివారం విచారణ చేప ట్టారు. సంఘటన స్థలానికి వెళ్లి, చుట్టుపక్కల వారిని ఆరోజు జరిగిన ఘటనపై ఆరాతీసి కొంత సమాచారం సేకరించారు. ఆయన మాట్లాడుతూ గడసింగుపురం గ్రామానికి చెందిన గరుగుబిల్లి అలీసా, చింతాడ మధు, నాగళ్ల బుజ్జిలు ఈ నెల 21వ తేదీ సాయంత్రం జియ్యమ్మవలస బస్టాండ్ వద్దకు స్నాక్స్ తినడానికి వెళ్లగా, అక్కడే ఉన్న జియ్యమ్మవలసకు చెందిన మణిభూషణరావు వారితో గొడవ పడ్డాడని, అదే సమయంలో అక్కడికి వచ్చిన దత్తి చంద్రమౌళి, ఆయన కొడుకు దత్తి సతీష్‌లు కూడా అలీసా, మధు, బుజ్జిలను కులం పేరుతో దూషించి దాడికి ఎగబడినట్లు ఫిర్యాదు అందిందన్నారు. అలాగే ఫిర్యాదు చేసిన ముగ్గురూ తమ ఇంటికి వచ్చి నానా హంగామా చేశారని దత్తి చంద్రమౌళి కుమార్తె దత్తి సంతోషి కూడా ఫిర్యాదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఒకరిపై మరొకరు చేసుకున్న ఫిర్యాదుల మేరకు సంఘటన స్థలానికి వెళ్లి, విచారణ చేపట్టామని, తుది నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

ఉద్యోగులు అందించిన సేవలు చిరస్మరణీయం

సీతానగరం: ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు సహజమే అయినా విధినిర్వహణలో వారు ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయంగా ఉండిపోతాయని వైఎస్సార్‌సీపీ సీతానగరం మండల సీనియర్ నాయకుడు కె శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఎస్.జగన్నాథం అన్నారు. మండలంలోని చినభోగిలి సచివాలయం పరిధిలో ప్రజలకు సేవలందించి బదిలీపై వెళ్లిన టీఏ తేజశ్విని, విద్యుత్ కార్యదర్శి జనార్దన్, కార్యదర్శి మనోహర్‌లను శనివారం సర్పంచ్ కురమాన రాధ ఆధ్వర్యంలో సచివాలయంలో ఘనంగా సత్కరించి వారి సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో సచివాలయ వ్యవస్థ వచ్చినప్పటి నుంచి విధులు నిర్వహించి, ప్రజల మన్ననలు పొందిన వారిని సత్కరించి గౌరవించడం అభినందనీయమన్నారు. ఎక్కడ ఉన్నా ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఇంతటి ఆదరాభిమానాలు చూపించి, సత్కరించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పెంట తిరుపతిరావు, ఎం.శంకరరావు మాస్టారు, వెంకటనాయుడు, రమేష్, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



బదిలీ అయిన మనోహర్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసరావు, సర్పంచ్ రాధ

గ్రహణం మొర్రిపై వైద్య శిబిరం



బాలల సత్వర చికిత్స కేంద్రంలో వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

పార్వతీపురంటౌన్: పిల్లల్లో పుట్టుక లోపాలైన పెదవి, అంగటి చీలిక సమస్య ఉన్నవారికి ఉచిత శస్త్ర చికిత్స కోసం జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. స్మైల్ ట్రిన్ ఫౌండేషన్, విశాఖపట్నం వారి సౌజన్యంతో ఎంజీఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్, విశాఖపట్నంలో వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నారని ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త డాక్టర్ పీఎల్ రఘుకుమార్, డీఈఐసీ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్. భరత్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తుగా ఇచ్చిన సమాచారంతో జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వైద్య శిబిరానికి ఆయా సమస్యలున్న పిల్లలను వారి తల్లిదండ్రులు తీసుకువచ్చారని, సెవెన్ హిల్స్ పిల్లల వైద్య నిపుణురాలు డా.గంటా సుమిత్ర, డీఈఐసీ వైద్యుడు డా. భరత్ చంద్ర పిల్లలకు ఆరోగ్య తనిఖీలు చేపట్టారని తెలిపారు. పెదవి, అంగటి చీలిక తదితర పుట్టుక లోపాలున్న పిల్లలకు పరీక్షలు చేసి శస్త్ర చికిత్సకు ఏడుగురు పిల్లలను ఎంపిక చేశారని, వారికి విశాఖపట్నంలోని సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో చికిత్స చేసి పుట్టుక లోపాలను సరి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా. శ్రీధర్, డీఈఐసీ వైద్యాధికారి ఎ. లలితదుర్గ, దంత వైద్యురాలు కె. సౌజన్య, స్మైల్‌ట్రిన్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఎస్.మనీషా, ఫిజియోథెరపిస్ట్ లక్ష్మీనారాయణ, చైల్డ్ సైకాలజిస్ట్ ఉదయకుమార్, సోషల్ వర్కర్ అంజమ్మ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు బాబోయ్.. కుక్కలు..


- పట్టణంలో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు
- కనబడిన వారందరిపై దాడి
- హడలిపోతున్న ప్రజలు

పాలకొండ రూరల్:

డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ జనంపై దాడికి దిగుతున్నాయి. పాదచారులు, వాహనచోదకులే లక్ష్యంగా దాడికి యత్నిస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణ పరిధిలోని 20 వార్డుల్లో ఎక్కడబడితే అక్కడ గుంపులుగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా సంతమార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో పదుల సంఖ్యలో తిరుగుతూ కనబడిన వారిని కరుస్తున్నాయి. ఇటీవల పట్టణంలోని కొత్తవీధిలో దేవరపేటలో పాఠశాల నుంచి తిరిగి వస్తున్న చిన్నారులపై కుక్కలు దాడి చేశాయి. ఆ సమయంలో స్థానికులు స్పందించడంతో పిల్లలు క్షేమంగా బయటపడ్డారు. ఈ సమస్య పట్టణానికే పరిమితం కాలేదని.. మండలంలోని అన్ని పంచాయతీల్లో చోటు చేసుకుందని ప్రజలు వాపోతున్నారు.

నిర్లక్ష్యం చేస్తే.....

పట్టణంలో ఏ వీధికి వెళ్లినా వీధి కుక్కలు పదుల సంఖ్యలో కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారులు, మాంసం, చేపల దుకాణాల వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉంది. కుక్క కరిచిన వెంటనే వైద్యం పొందాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలకు ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. సకాలంలో వైద్యం అందకపోతే రేబిస్ వ్యాధి సోకుతుందని హెచ్చరిస్తున్నారు.



పట్టణ ప్రధాన రహదారిలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

నివారణకు చర్యలు తీసుకుంటాం..



పట్టణంలో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉందనే విషయం మా దృష్టికి వచ్చింది. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా సంతానోత్పత్తి లేకుండా ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. వీధి కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాల్లో వదిలిపెట్టేందుకు అవసరమైన చర్యలపై దృష్టి సారిస్తాం.

– ఎస్.సర్వేశ్వరరావు, నగర కమిషనర్, పాలకొండ

బయటకు వెళ్లాలంటే భయం..



పట్టణంలో కుక్కల సంచా రం అధికంగా ఉంది. బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉంటోంది. ప్రధాన మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో, కార్గిల్ కూడలి, తదితర జంక్షన్లలో పదుల సంఖ్యలో కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.రామ్మూర్తి, కూరగాయల రైతు, పాలకొండ మండలం

రేబిస్ వ్యాధి లక్షణాలు ఇలా.....

- జ్వరం, తలనొప్పి, విరేచనాలు, వాంతులవుతాయి.
- కాళ్లు, చేతులు పడిపోవడం (పక్షవాతం), ఫిట్స్ రావడం, పిచ్చిపిచ్చిగా మాట్లాడటం వంటి లక్షణాలు తలెత్తుతాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- కుక్క కరవగానే వీలైనంత త్వరగా కుళాయి కింద గాని లేదా మగ్గుతో నీళ్లు పోస్తూ గాయమైన భాగాన్ని సబ్బుతో కనీసం 15 నిమిషాలు శుభ్రంగా కడగాలి.
- గాయానికి ఎలాంటి కట్టూ కట్టకూడదు.
- కుక్క కాటుకు ఆహార నియమాలు ఏమీ లేవు.
- కరిసిన కుక్కను పది రోజుల పాటు గమనించాల్సి ఉంటుంది. కుక్క ఆరోగ్యంగా ఉంటే గాయపడిన వారు భయపడనక్కర్లేదు.
- వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి. గాయానికి ఎప్పటికప్పుడు డ్రెస్సింగ్ చేయించాలి. ఏఆర్వీ వ్యాక్సిన్ 0, 03, 07, 14 రోజుల్లో ఒక డోస్ చొప్పున తీసుకోవాలి.